

బీఆర్ఎస్‌లో చేరుతున్న కాంగ్రెస్ నాయకులు

### కాంగ్రెస్, సీపీఎం నుంచి

## బీఆర్ఎస్‌లో భారీగా చేరికలు

**కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించిన మంత్రి ఎర్రబెల్లి**

పాలకుర్తి రూరల్, అక్టోబర్ 15: ఈ అసెంబ్లీ ఎన్నికల్లోపే పాలకుర్తి నియోజక వర్గంలో కాంగ్రెస్ ఖాళీ అవడం ఖాయమని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. ఆదివారం మండలంలోని బమ్మెర గ్రామానికి చెందిన సీపీఎం, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు మంత్రి ఎర్రబెల్లి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. వీరికి మంత్రి ఎర్రబెల్లి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎర్రబెల్లి మాట్లాడుతూ రాష్ట్రంలో సీఎం కేసీఆర్, నియోజక వర్గంలో తాను చేస్తున్న అభివృద్ధికి ఆకర్షితులై బీఆర్ఎస్‌లో భారీగా చేరుతున్నారని చెప్పారు. తనను నమ్ముకుని పార్టీలో చేరిన ప్రతి కార్యకర్తను కంటికి రెప్పలా కాపాడుకుంటానని హామీ ఇచ్చారు. రాష్ట్రంలో కాంగ్రెస్, బీజేపీ అడ్రస్ గల్లంతైందన్నారు. నియోజక వర్గంలో కాంగ్రెస్ పార్టీకి డిపాజిట్ రాదన్నారు. మాయ మాటల కాంగ్రెస్‌ను, మోసాల బీజేపీని ప్రజలు తరిమికొట్టాడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. అభివృద్ధి, సంక్షేమానికి ప్రజలు పట్టం కడుతారని పేర్కొన్నారు. బమ్మెర గ్రామానికి చెందిన సీపీఎం నాయకులు గుడికందుల సోమనర్సయ్య, కార్తీక్, కాంగ్రెస్ పార్టీకి చెందిన గొట్టిపర్తి యాకయ్య, వల్లెపు సోమయ్య, ఆలకుంట్ల సైదులు, బీమయ్య, సుడిగెల మహేశ్, రవీందర్, గుర్రం యాకయ్య, సోమరాజు, నవీన్‌తో పాటు 20 మంది బీఆర్ఎస్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు బత్తిని గోపాల్, శివరాత్రి సోమయ్య, ఉప సర్పంచ్ శివరాత్రి సుధాకర్, బత్తిని సొంమల్లు, కళ్లెం నర్సింహులు, మదన్ పాల్గొన్నారు.



అదుపులోకి తీసుకున్న గుడుంబా తయారీదారులు

## గుడుంబా స్థావరాలపై దాడి

### 50 లీటర్ల గుడుంబా స్వాధీనం
### 4వేల లీటర్ల బెల్లం పానకం ధ్వంసం

మహదేవపూర్, అక్టోబర్ 15 : గుడుంబా స్థావరాలపై ఆదివారం పోలీసులు దాడులు చేశారు. ఎస్సై రాజ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఎన్కపల్లి గ్రామ శివారు అటవీ ప్రాంతంలో గుడుంబా స్థావరాలపై దాడులు చేసి సుమారు 50 లీటర్ల గుడుంబా స్వాధీనం చేసుకొని, 4 వేల లీటర్ల బెల్లం పానకాన్ని పారబోశారు. కొర్లకుంట గ్రామానికి చెందిన ఇద్దరు, ఎన్కపల్లి గ్రామాని కి చెందిన ఒకరిపై కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు. గుడుంబా తయారు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు.

**మహాముత్తారంలో..**

మహాముత్తారం : మండలంలోని నిమ్మగూడెంలో ఎస్సై సుధాకర్ ఆధ్వర్యంలో పోలీసులు గుడుంబా స్థావరాలపై దాడులు నిర్వహించారు. తడన్ల సారయ్య ఇంటి వద్ద 800 లీటర్ల బెల్లం పానకం, గుడుంబా తయారీకి ఉపయోగించే సామగ్రిని ధ్వంసం చేశారు.



నిమ్మగూడెంలో బెల్లం పానకాన్ని పారబోస్తున్న పోలీసులు

# సీఎం కేసీఆర్‌ను కలిసిన పొన్నాల..

- నేడు జనగామ సభలో బీఆర్ఎస్‌లో చేరిక
- సొంతగడ్డ నుంచే మళ్లీ రాజకీయ పునర్జన్మ
- గులాబీ కండువా కప్పుకోనున్న నలుగురు బీజేపీ, కాంగ్రెస్ మున్సిపల్ కౌన్సిలర్లు?
- జనగామలో బీఆర్ఎస్‌కు కొత్త ఊపు



ప్రగతి భవన్‌లో సీఎం కేసీఆర్‌ను కలిసిన టీ-పీసీసీ మాజీ అధ్యక్షుడు పొన్నాల లక్ష్మయ్య ఆయన కుటుంబ సభ్యులు, చిత్రంలో జనగామ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి

జనగామ, అక్టోబర్ 15 (నమస్తే తెలంగాణ) : టీ-పీసీసీ తొలి అధ్యక్షుడు, మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య ఆదివారం సాయంత్రం ప్రగతి భవన్‌లో బీఆర్ఎస్ జాతీయ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి కేసీఆర్‌తో మర్యాద పూర్వకంగా భేటీ అయ్యారు. పొన్నాల దంపతులు సహా వారి పెద్ద కుమారుడు రామకృష్ణను సాదరంగా ఆహ్వానించిన సీఎం కేసీఆర్ వారి యోగక్షేమాలు తెలుసుకుని కాసేపు ముచ్చటించారు. ఈ సందర్భంగా రాజ్యసభలో బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నేత, ఎంపీ కే కేశవరావు, ఎమ్మెల్సీ, జనగామ బీఆర్ఎస్ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి, పార్టీ సీనియర్ నాయకుడు డాక్టర్ దాసోజు శ్రవణ్ ఉన్నారు.

**నేడు జనగామ సభలో బీఆర్ఎస్‌లోకి..**

హైదరాబాద్ నుంచి కేసీఆర్ వెంట హెలికాప్టర్‌లో రానున్న పొన్నాల జనగామ ప్రజా ఆశ్వీర్వాద సభలో అధినేత సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరుతారని పార్టీ వర్గాల ద్వారా తెలిసింది. అదేవిధంగా పట్టణానికి చెం దిన బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు చెందిన నలుగురు కౌన్సిలర్లు గులాబీ తీర్థం పుచ్చుకోబోతున్నట్లు తెలుస్తున్నది. కాంగ్రెస్‌లో 45 ఏండ్ల సుదీర్ఘ రాజకీయ అనుబంధం ఉన్న పొన్నాల టీ-పీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డి సహా ఏఐసీసీ పెద్దల తీరుపై అసహనంతో పార్టీకి రాజీనామా చేశారు. కాంగ్రెస్‌లో జనగామ నుంచి మొదలైన పొన్నాల ప్రస్థానం తిరిగి అదే గడ్డపై గులాబీ పార్టీ అధినేత కేసీఆర్ నేతృత్వంలో రాజకీయ పునర్జన్మ లభించబోతున్నది. ఎన్నికలు సమీపిస్తున్న వేళ పొన్నాల లక్ష్మయ్య లాంటి సీనియర్ నాయకుడు బీఆర్ఎస్‌లో చేరనుండడంతో జనగామలో ఆ పార్టీకి కొత్త ఊపు, అభ్యర్థికి పల్లా రాజేశ్వర్‌రెడ్డి అదనపు బలం పెరగనున్నది.



రఘునాథపల్లి మండల కేంద్రంలో సంబురాలు చేసుకుంటున్న బీఆర్ఎస్ శ్రేణులు

## బీఆర్ఎస్ మేనిఫెస్టోపై సంబురాలు

రఘునాథపల్లి : సీఎం కేసీఆర్ ప్రకటించిన ఎన్నికల మేనిఫెస్టోపై హర్షం వ్యక్తం చేస్తూ ఆదివారం మండల కేంద్రంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వారాల రమేశ్‌యాదవ్ ఆధ్వర్యంలో ఆదివారం పటాకులు కాల్చి సంబురాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా రమేశ్‌యాదవ్ మాట్లాడుతూ తెలంగాణ ప్రజలంతా సీఎం కేసీఆర్ వెంటే ఉన్నారని పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ బొల్లం అజయ్‌కుమార్, రైతు బంధు సమితి జిల్లా సభ్యులు మారుజోడు రాంబాబు, జేరిపోతుల మహేందర్, గైని శ్రీనివాస్, మల్యానాయక్, నామాల బుచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

## క్రీడలను ప్రోత్సహిస్తున్న ప్రభుత్వం

- పల్లెల్లో క్రీడాప్రాంగణాల ఏర్పాటు
- వాటిని సద్వినియోగం చేసుకోవాలి
- క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించాలి
- ఎస్‌జీఎఫ్ఐ జిల్లా కార్యదర్శి జ్యోతి



క్రీడాకారులకు బహుమతులు అందజేస్తున్న ఎస్‌జీఎఫ్ఐ జిల్లా కార్యదర్శి జ్యోతి

తొర్రూరు, అక్టోబర్ 15: క్రీడలకు పెద్దపీట వేసిన రాష్ట్ర ప్రభుత్వం క్రీడాకారులను అన్ని విధాలుగా ప్రోత్సహిస్తున్నదని ఎస్‌జీఎఫ్ఐ జిల్లా కార్యదర్శి జ్యోతి అన్నారు. మహబూబాబాద్ జిల్లా తొర్రూరు డివిజన్ కేంద్రంలోని యతిరాజారావు పార్కులో ఎస్‌జీఎఫ్ఐ ఆధ్వర్యంలో చేపట్టిన 67వ రాష్ట్రస్థాయి 17, 19 ఏళ్ల బాల, బాలికల రగ్బీ పోటీలు ఆదివారం ముగిశాయి. 10 జిల్లాల క్రీడాకారులు పాల్గొనగా, అండర్-19 బాలుర విభాగంలో నల్లగొండ జిల్లా విజేతగా నిలిచింది. రన్నరఫ్‌గా రంగారెడ్డి, బాలికల విభాగంలో మహబూబ్‌నగర్ విజేతగా నిలువగా, ద్వితీయ స్థానంలో మెదక్ నిలిచింది. అండర్-17 విభాగంలో విజేతగా నిజామాబాద్, ద్వితీయ స్థానంలో నల్లగొండ, బాలికల విభాగంలో విజేతగా మహబూబ్‌నగర్, ద్వితీయ స్థానంలో నల్గొండ నిలిచింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో క్రీడల అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అన్ని నియోజకవర్గాల్లో మినీ స్టేడియాలను ఏర్పాటు చేస్తున్నదని, ఇప్పటికే 50 శాతం పూర్తి చేసిందన్నారు. క్రీడాకారులకు ఉన్నత విద్య, ఉద్యోగ నియామకాల్లో రిజర్వేషన్లు అమలు చేస్తున్నారని తెలిపారు. రగ్బీ క్రీడలో రాణిస్తే ఉద్యోగ, ఉపాధి అవకాశాల్లో రిజర్వేషన్లు వర్తిస్తాయని తెలిపారు. రాష్ట్రంలో ఈ క్రీడకు ఆదరణ పెరిగిందని, జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారులను తీర్చిదిద్దుతున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో షూటింగ్ బాల్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి, క్రీడా కన్వీనర్ చెడుపల్లి ఐలయ్య, రాష్ట్ర పరిశీలకులు యూసఫ్ ఖాన్, రమేశ్, శ్రీనివాస్, విజయ్‌కుమార్, సునీల్, రెమో శ్రీనివాస్, మాధవి, ఉపాధ్యాయులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

## ఐదు జిల్లాల బెంచ్ ప్రెస్ పోటీలు ప్రారంభం

డోర్నకల్, అక్టోబర్ 15 : డోర్నకల్ భారత్‌వీర్ వ్యాయామ శాల ఆధ్వర్యంలో మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల బెంచ్ ప్రెస్ పోటీలను ఆదివారం జైన్ భవన్‌లో మున్సిపల్ చైర్మన్ వాంకుడోత్ వీరన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డోర్నకల్ క్రీడాలకు పుట్టినిల్లు అని అన్నారు. ఎంతో మంది క్రీడాకారులు బెంచ్ ప్రెస్ పోటీల్లో రాష్ట్ర స్థాయిలో మెడల్స్ సాధించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ కేశబోయిన కోటిలింగం, కౌన్సిలర్ కాలా సురేందర్ కుమార్ జైన్, కోచ్ మండలోజు సుధాకర్, పవర్ లిఫ్టింగ్ స్టేట్ అసోసియేషన్ వైస్ చైర్మన్ మల్లేశ్, కొత్త రాంబాబు, లక్ష్మణ్ పాల్గొన్నారు.

## అత్తను చంపిన కానిస్టేబుల్ అరెస్టు

నయీంనగర్, అక్టోబర్ 15 : కేయూ పోలీస్ స్టేషన్ పరిధిలోని గుండ్ల సింగారం గ్రామంలో అనిగెల కమలను ఆమె అల్లుడు కానిస్టేబుల్ ఆడే ప్రసాద్ డబ్బుల విషయంలో గొడవ పడి తన వెంట తెచ్చుకున్న పిస్టల్‌తో కాల్చి చంపిన ఘటన విదితమే. ఆదివారం నిందితుడు ప్రసాద్‌ను కేయూ పోలీసులు అరెస్టు చేసి పరకాల జైలుకు తరలించినట్లు ఇన్‌స్పెక్టర్ అబ్బయ్య తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేరస్తుడు కానిస్టేబుల్ అయినప్పటికీ చట్టపరంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు.